ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక


ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :111 ఆదివారం ఫిబ్రవరి 15 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

## అసెంబ్లీలో మహాశివరాత్రి సందడి

●శివతత్వానికి ప్రతీకగా ప్రత్యేక చీరల్లో మహిళా ప్రజాప్రతినిధులు
●బడ్జెట్ అనంతరం ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక భేటీ
●స్పీకర్, మంత్రులతో ఆత్మీయ కలయిక



అమరావతి,//(మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రేపటి మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని కూటమి ప్రభుత్వానికి చెందిన మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు శివతత్వానికి ప్రతీకగా ఉన్న ప్రత్యేక చీరలను ధరించి సభకు హాజరయ్యారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం వీరంతా ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఒకే రకమైన వస్త్రధారణతో అసెంబ్లీకి విచ్చేసిన మహిళా ప్రజాప్రతినిధులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, ఎస్ సవితతో పాటు ఇతర మహిళా ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా వస్త్రధారణ చేయడం విశేషంగా నిలిచింది. మహిళా ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రితో భేటీ సందర్భంగా రాష్ట్రాభివృద్ధి, ప్రజాసేవల అంశాలపై చర్చించినట్లు సమాచారం. పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని శాసనసభ వేదికపై ఐక్యతను ప్రదర్శించడం సానుకూల సంకేతమని పలువురు అభిప్రాయపడ్డారు. అనంతరం అసెంబ్లీ లాబీల్లో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణలను కూడా మహిళా నేతలు కలిశారు. శాసనసభ ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొనడంతో పండుగ ముందస్తు సంబరాలు కనువిందు చేశాయి.



## రేవంత్ ప్రభుత్వంపై ధర్మపురి అరవింద్ విమర్శలు

•బండి సంజయ్‌ను వారియర్‌గా అభివర్ణించిన ఎంపీ
•కార్పొరేటర్ల ఎత్తుకెళ్లింపులపై హెచ్చరిక
•నిజామాబాద్ ఫలితాల్లో బీజేపీ ఆధిక్యం అని వ్యాఖ్య



నిజామాబాద్, 14 ఫిబ్రవరి 2026 (మనప్రజాప్రతినిధి): నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఎంపీ ధర్మపురి అరవింద్ రాష్ట్ర రాజకీయాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ ఒక వారియర్ అని, ఆయన అర్జునుడి పాత్రకు సరిపోతారని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన ప్రభుత్వం కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలమైన స్థాయిలో లేరని అన్నారు. మున్సిపల్ వార్డు సభ్యులు, కార్పొరేటర్లను బలవంతంగా ఎత్తుకెళ్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజలు ఇప్పటికే ఛీకొడుతున్నారని, కార్పొరేటర్లను ఎత్తుకెళ్లే ప్రయత్నాలు చేస్తే మరింత ప్రతికూలత ఎదురవుతుందని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ కార్పొరేషన్ ఫలితాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కంటే ఎక్కువ స్థానాలు బీజేపీ గెలుచుకుందని తెలిపారు. తన పార్లమెంట్ పరిధిలో కూడా బీఆర్ఎస్ కంటే ఎక్కువ సీట్లు సాధించామని వెల్లడించారు. కాంగ్రెస్ లౌకిక వాద పార్టీ కాదని, ఓ బ్రోకర్ పార్టీగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం పోలీసు శాఖను దుర్వినియోగం చేస్తోందని అరవింద్ ఆరోపించారు. తమ పార్టీ అభ్యర్థులను పోలింగ్ బూత్‌ల నుంచి పంపించారని, వారిపై కేసు పెట్టాలని తాను భావించగా పోలీసులే తనపై కేసు నమోదు చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పోలీసులు సూచించారనే ఆరోపణలు కూడా చేశారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఎత్తుకెళ్లేందుకు కాంగ్రెస్‌కు పోలీసులు సహకరిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు రాజకీయాలను భ్రష్టు పట్టించారనే కారణంతో ఓడించారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి అదే దారిలో నడుస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో హుందాతనం అవసరమని, ఎవరికి మద్దతు ఇవ్వాలనేది కార్పొరేటర్ల స్వేచ్ఛ అని అన్నారు. బలవంతపు రాజకీయాలు సరికాదని హెచ్చరించారు. కరీంనగర్‌లో బండి సంజయ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటిందని ప్రశంసించారు.

## కాంగ్రెస్ ఆశించిన ఫలితాలు రాలేదన్న కేటీఆర్

+హంగ్ మున్సిపాలిటీల్లోనూ బీఆర్ఎస్‌కు అవకాశాలున్నాయన్న విశ్వాసం
+ఫార్ములాఈ అంశంపై మరోసారి ప్రభుత్వంపై విమర్శలు
+స్థానిక ఎన్నికల ఫలితాలపై కేటీఆర్ చిట్‌చాట్





హైదరాబాద్, 14 ఫిబ్రవరి (మనప్రజాప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. వచ్చిన ఫలితాలతో కాంగ్రెస్ పార్టీ అసంతృప్తిగానే ఉందని ఆయన వ్యాఖ్యానించారు. వారు ఆశించినన్ని స్థానాలు రాలేదని పేర్కొన్నారు. తమ పార్టీ కార్యకర్తలు గట్టి పోరాటం చేసి అద్భుతంగా నిలిచారని తెలిపారు. మొత్తం 30కి పైగా మున్సిపాలిటీలు వస్తాయని భావించినప్పటికీ, వచ్చిన 17 మున్సిపాలిటీలతో పాటు హంగ్ ఏర్పడిన ప్రాంతాల్లో కూడా తమకు విజయావకాశాలు ఉన్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ తమ ప్రదర్శన బాగుందని చెప్పుకోవడం అర్థం కావడం లేదని కేటీఆర్ విమర్శించారు. గతంతో పోలిస్తే వారికి తక్కువ ఓట్లు, తక్కువ వార్డులు వచ్చాయని అన్నారు. జాతీయ అధ్యక్షుడిని తెచ్చి ప్రచారం చేసినా ఒక్క మున్సిపాలిటీ కూడా గెలవలేకపోయారని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లోకల్ అంశాలే కీలకమని, అధికారంలో ఉన్నవారికి సాధారణంగా అనుకూల పరిస్థితులు ఉంటాయని పేర్కొన్నారు. డబ్బు ప్రభావం విపరీతంగా పెరిగిందని, కాంగ్రెస్ విచ్చలవిడిగా ఖర్చు చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్ని స్థానాలు గెలిచిందో అందరికీ తెలుసని ఆయన గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గతంలో కాంగ్రెస్ పరిస్థితి ఏంటో ప్రజలు గుర్తుంచుకున్నారని అన్నారు. ఫలితాలు ఆశించినంతగా రాని జిల్లాల్లోనూ పార్టీ శ్రేణులు గట్టిగా పోరాడాయని, ఈ ఎన్నికలు తమకు సంతృప్తికరమైనవేనని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత విమర్శలు చేసిన వారికి ఈ ఫలితాలే సమాధానమని వ్యాఖ్యానించారు. ఎక్స్ అఫీషియో సభ్యుల నిబంధనల విషయంలో ప్రభుత్వానికే స్పష్టత లేదని కేటీఆర్ అన్నారు. కలెక్టర్లు, చీఫ్ సెక్రటరీ భిన్నాభిప్రాయాలు చెబుతున్నారని విమర్శించారు. ఫార్ములాఈ అంశాన్ని మరోసారి ప్రభుత్వం తెరపైకి తీసుకువస్తోందని, ఇప్పటికే పలుమార్లు విచారణకు పిలిచినా ఏమీ తేలలేదని పేర్కొన్నారు. ఎన్నిసార్లు పిలిచినా హాజరవుతామని, సత్యాన్ని చెబుతామని స్పష్టం చేశారు. అవసరమైతే జైలుకు వెళ్లడానికైనా భయపడబోమని, ఆ కేసులో ఎలాంటి ఆధారాలు లేవని పోలీస్, ఏసీబీ అధికారులు ఇప్పటికే ముఖ్యమంత్రికి చెప్పారని ఆయన పేర్కొన్నారు.

## డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు అప్రమత్తంగా ఉండండి

◆నకిలీ పోలీసులుగా సైబర్ నేరగాళ్ల కొత్త పన్నాగం
◆వాట్సాప్, వీడియో కాల్స్ ద్వారా బెదిరింపులు
◆'జాగృత్ హైదరాబాద్ సురక్షిత్ హైదరాబాద్'లో భాగస్వామ్యం కావాలి



హైదరాబాద్, 14 ఫిబ్రవరి 2026 (మనప్రజాప్రతినిధి): పోలీసు వేషం చూసి మోసపోవద్దని, వీడియో కాల్ నమ్మి మునిగిపోవద్దని హైదరాబాద్ పోలీసు ఉన్నతాధికారి వి.సి. సజ్జనార్ హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్న విధానంపై అవగాహన కల్పిస్తూ ఆయన సామాజిక మాధ్యమాల ద్వారా కీలక సూచనలు చేశారు. నకిలీ పోలీసులుగా మారి వీడియో కాల్స్ ద్వారా ప్రజలను భయపెట్టి డబ్బులు దోచుకుంటున్నట్లు తెలిపారు. పోలీసులు ఎప్పుడూ వాట్సాప్ లేదా వీడియో కాల్స్ ద్వారా విచారణ జరపరని, డబ్బులు అడగరని ఆయన స్పష్టం చేశారు. చట్టంలో 'డిజిటల్ అరెస్ట్' అనే పదమే లేదని పేర్కొన్నారు. ఇలాంటి కాల్స్ వచ్చినప్పుడు భయపడకుండా వెంటనే స్థానిక పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ విభాగానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ప్రజల భయాన్ని ఆయుధంగా మార్చుకుని డబ్బులు దోచుకుంటున్నారని తెలిపారు. వీడియో కాల్స్ ద్వారా నకిలీ ఐడీలు చూపించి బెదిరింపులకు పాల్పడుతున్నారని వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద కాల్స్‌ను పట్టించుకోకూడదని సూచించారు. హైదరాబాద్ పోలీసులు చేపట్టిన 'జాగృత్ హైదరాబాద్ సురక్షిత్ హైదరాబాద్' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన వీడియోను ఇతరులతో పంచుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులను కూడా జాగ్రత్తగా ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ అని అధికారులు స్పష్టం చేశారు.

## ఎంజీఎన్ఆర్ఈజీప పరిరక్షణ యాత్రలో వైఎస్ షర్మిల

+కడప యానాది కాలనీలో రచ్చబండ కార్యక్రమం
+ఉపాధి హామీ పథకం బలోపేతంపై డిమాండ్
+కాంగ్రెస్ అమలు చేసిన చట్టం పునరుద్ధరణ కోరింపు



కడప, 14 ఫిబ్రవరి (మనప్రజాప్రతినిధి): ఎంజీఎన్ఆర్ఈజీఏ పరిరక్షణ యాత్ర నేడు వైఎస్ఆర్ కడప జిల్లాలో కొనసాగింది. కడప టౌన్ యానాది కాలనీలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధిపొందిన శ్రామికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు వైఎస్ షర్మిల మాట్లాడుతూ పథకం అమలులో వస్తున్న మార్పులపై ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ పనులను సమర్థంగా అమలు చేసిందని, కరువు పనులు విస్తృతంగా సాగాయని, వేతనాలు సమయానికి అందేవని శ్రామికులు గుర్తుచేసుకున్నారని తెలిపారు. 100 రోజుల పని హక్కుగా మారిందని, గ్రామీణ కుటుంబాలకు ఇది ఆర్థిక భరోసా కల్పించిందని

2

## ముంబైలో కూలిన మెట్రో పిల్లర్


-రోడ్డుపై వాహనాలపై పడిన నిర్మాణ స్తంభం
-ఒకరు మృతి, నలుగురికి గాయాలు
-ట్రాఫిక్ స్తంభనతో ములుంద్‌లో కలకలం



ముంబై, 14 ఫిబ్రవరి 2026 (మనప్రజాప్రతినిధి): మహారాష్ట్ర రాజధాని ముంబై నగరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న మెట్రో పిల్లర్ అకస్మాత్తుగా కూలిపోవడంతో ఒకరు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. ములుంద్ ప్రాంతంలోని ఎల్బీఎస్ రోడ్ సమీపంలో, జాన్సన్ అండ్ జాన్సన్ ఫ్యాక్టరీ వద్ద నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో శనివారం మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కూలిన పిల్లర్ రోడ్డుపై వెళ్తున్న వాహనాలపై పడటంతో తీవ్ర నష్టం సంభవించింది. ప్రమాద సమయంలో అక్కడుగా వెళ్తున్న ఒక ఆటో

2

# ఎంజీఎన్ఆర్ఈజీఏ పరిరక్షణ యాత్రలో వైఎస్ షర్మిల



మెదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పథకం నీరుగార్చబడుతోందని, జాబ్ కార్డుల తొలగింపు, వేతనాల ఆలస్యం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని రచ్చబండ వేదికగా కార్మికులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ డబ్బులు ఎప్పుడు ఖాతాల్లో జమ అవుతాయో స్పష్టత లేదని వారు పేర్కొన్నారని వివరించారు. మహాత్మా గాంధీ పేరుతోనే పథకం కొనసాగాలని, కాంగ్రెస్ అమలు చేసిన ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. గ్రామీణ శ్రామికులకు పూర్తి స్థాయి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని, పథకాన్ని బలోపేతం చేయాలని ఆమె కోరారు.

# పుదుచ్చేరిలో ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు కోరిన అమిత్ షా

**-అభూతపూర్వ అభివృద్ధి సాధించామని వ్యాఖ్య**
**-ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం**
**-కరైకాల్ సభలో ప్రజలతో ముఖాముఖి**



కరైకాల్, 14 ఫిబ్రవరి (మనప్రజాప్రతినిధి): పుదుచ్చేరిలో ఎన్డీఏ ప్రభుత్వం గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధిని సాధించడంతో పాటు ప్రజా సంక్షేమానికి సంపూర్ణంగా సేవలందించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన యూనియన్ టెరిటరీగా పుదుచ్చేరిని తీర్చిదిద్దే ప్రయాణాన్ని కొనసాగించేందుకు ప్రజలు మరోసారి ఎన్డీఏ ప్రభుత్వానికే మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పుదుచ్చేరి అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలు, పారదర్శక పాలన ద్వారా ప్రజల విశ్వాసాన్ని



సంపాదించామని తెలిపారు. ఈ అభివృద్ధి యాత్రను నిలబెట్టేందుకు ఎన్డీఏ ప్రభుత్వాన్ని తిరిగి ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. కరైకాల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో అమిత్ షా ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. స్థానిక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుంటుందని స్పష్టం చేశారు. పుదుచ్చేరి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల విశ్వాసంతోనే అభివృద్ధి సాధ్యమని, అదే విశ్వాసాన్ని మరోసారి ప్రదర్శించాలని అమిత్ షా కోరారు.

# వరకట్న వేధింపులు తాళలేక డిప్యూటీ జైలర్ భార్య ఆత్మహత్య

**- సమస్తిపూర్‌లో విషాద ఘటన**
**- రూ.10 లక్షలు, కారు కోసం వేధింపుల ఆరోపణలు**
**- కేసు నమోదు పరారీలో భర్త, అత్తింటివారు**



సమస్తిపూర్ (బిహార్), ఫిబ్రవరి 14 (మనప్రజాప్రతినిధి): బిహార్ రాష్ట్రంలోని సమస్తిపూర్‌లో వరకట్న వేధింపులు తాళలేక డిప్యూటీ జైలర్ భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. 2023 మే నెలలో అసిస్టెంట్ జైల్ సూపరింటెండెంట్ నందు చౌదరీతో శ్వేతా కుమారి వివాహం జరిగింది. వివాహానంతరం అత్తారింట్లో వేధింపులు ఎదుర్కొంటూ వచ్చిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇటీవల అత్తారింట్లోనే ఉరి వేసుకొని శ్వేతా కుమారి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. రూ.10 లక్షల నగదు, ఫార్చునర్ కారు కట్నంగా ఇవ్వాలని శ్వేతాపై ఒత్తిడి తీసుకువచ్చారని కుటుంబీకులు చెబుతున్నారు. మూడు రోజుల పాటు ఆహారం ఇవ్వకుండా వేధింపులకు గురిచేసి హత్య చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై శ్వేతా కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన అనంతరం భర్త నందు చౌదరీతో పాటు అత్తింటి వారు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వరకట్న వేధింపుల కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. నిందితులను త్వరలోనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# బడ్జెట్ అంతా అంకెల గారడీ బాబు మార్కు వంచన!



నరసన్నపేట:( జలుమూరు) ప్రజాప్రతినిధి
కూటమి సర్కారుపై ధర్మాన కృష్ణదాస్ నిప్పులు
నరసన్నపేట:-రాష్ట్ర శాసనసభలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను నిలువునా వంచించేలా ఉందని వైఎస్ఆర్సిపి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఈ బడ్జెట్‌లో పేదలకు, రైతులకు ఒరిగిందేమీ లేదని, కేవలం అంకెల గారడీతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. అడుగడుగునా మోసమే.. "ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ భారీ హామీలు ఇచ్చిన చంద్రబాబు, ఇప్పుడు బడ్జెట్‌లో వాటి ఊసే ఎత్తకపోవడం సిగ్గుచేటు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1500 వంటి పథకాలకు పైసా కేటాయించకుండా ఆడబిడ్డలను ఘోరంగా మోసం చేశారు" అని కృష్ణదాస్ విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకానికి అరకొర నిధులు కేటాయించి రైతులకు వెన్నుపోటు పొడిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రకు మొండిచేయిపారిశ్రామికంగా, విద్యాపరంగా వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాకు బడ్జెట్‌లో ఎటువంటి ప్రత్యేక కేటాయింపులు లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వ హయాంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ ప్రభుత్వం విస్మరించిందని, కనీసం పూర్తి కావాల్సిన ప్రాజెక్టులకు కూడా నిధులు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో చూపిన గణాంకాలు అన్నీ అబద్ధాలని, రాష్ట్ర అప్పుల గురించి తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌పై, ప్రభుత్వం విస్మరించిన హామీల పైన వైఎస్ఆర్సిపి తరపున క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి పోరాడతామని ధర్మాన కృష్ణదాస్ హెచ్చరించారు.

# ముంబైలో కూలిన మెట్రో పిల్లర్

మెదటి పేజీ తరువాయి

రిక్షా, ఒక కారుపై మెట్రో పిల్లర్ పడింది. దీంతో వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వాహనాల్లో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు ఘటనాస్థలంలోనే మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. మరో నలుగురు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రులను సమీప ఆసు పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ముంబై మెట్రోపాలిటన్ రీజన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికా రులు, బీఎంసీ అధికారులు, మెట్రో సంస్థ ప్రతినిధులు



ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వారికి పూర్తిస్థాయి వైద్య సహాయం అందిస్తామని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ ఘటనతో ములుండ్ ప్రాంతంలో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. వాహనాల రాకపోకలు నిలిచి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి వాహ నాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లిం చారు. నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ప్రమాదాలు జరుగు తున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# హైటెక్ సిటీ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి యాక్షన్ ప్లాన్

**- లెమన్ ట్రీ నుంచి శిల్పారామం వరకు రోడ్డు విస్తరణ**
**- ఐదు శాఖల సంయుక్త ఇన్స్పెక్షన్, పనుల వేగవంతం**
**- దుర్గం చెరువు పరిరక్షణకు ఎస్టీపీసేవరేజ్ ప్రణాళికలు**



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (మనప్రజాప్రతినిధి): మాదాపూర్‌హైటెక్ సిటీ ప్రాంతాల్లో రోజూ లక్షా ముప్పై వేల మందికి పైగా ప్రయాణించే నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ అమలు ప్రారంభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, జలమండలి, పోలీసు, ఇరిగేషన్, విద్యుత్ శాఖలు, టీజీఐఐసీ సంయుక్తంగా కార్యాచరణ చేపట్టాయి. లెమన్ ట్రీ హోటల్ నుంచి శిల్పారామం వరకు రోడ్డు విస్తరణ పనుల పురోగతిని అధికారులు పరిశీలించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ, ఏసీపీ, మున్సిపల్ జోనల్ కమిషనర్ హేమంత్ తదితరులు ట్రిడెంట్ హోటల్ నుంచి శిల్పారామం వరకు ఉన్న మార్గాన్ని సందర్శించారు. ఎయిర్ వాల్వులు, ఎలక్ట్రిక్ పోల్స్ తరలింపు, రహదారి విస్తరణ వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. హైటెక్ సిటీ నుంచి మెడికవర్ ఆసుపత్రి వరకు చేపట్టాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనులు పూర్తయితే మాదాపూర్, మైండ్ స్పేస్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గనున్నట్లు అధికారులు తెలిపారు. దుర్గం చెరువు పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. చెరువులోకి మురుగు నీరు చేరకుండా ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసి నీటిని వదిలే ప్రణాళికను అమలు చేస్తున్నారు. మాదాపూర్ ప్రాంతం నుంచి వచ్చే మురుగునీటిని 1000 ఎంఎం డయా పైపులైన్ ద్వారా మళ్లించే పనులు పురోగతిలో ఉన్నాయి. పైపులైన్ పూర్తి అయితే లేక్ పార్కులో సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్య తగ్గనుంది. రహేజా మైండ్ స్పేస్ ప్రాంతాల్లో భవన నిర్మాణం, ల్యాండ్ స్కేపింగ్ అవసరాలకు తప్పనిసరిగా శుద్ధి చేసిన రీసైకిల్ నీటినే వినియోగించాలని జలమండలి ఎండీ ఆదేశించారు. ఎస్టీపీ నుంచి ప్రత్యేక పైపులైన్ నిర్మించి ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే చర్యలు చేపడుతున్నారు. చెరువు భూగర్భ జలాల స్థాయి, హైడ్రాలజీ కాపాడేందుకు శాశ్వత ప్రణాళిక అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.




# కొత్త దొమ్మాట గ్రామంలో కమాన్ నిర్మాణంలో అపశృతి..

మనప్రజాప్రతినిధి// దినపత్రిక, చేర్యాల,జనగామ: జనగామనియోజకవర్గం,చేర్యాల మండల పరిధిలోని కొత్త దొమ్మట గ్రామంలో నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి కమాన్ నిర్మాణంలో అపశృతి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని దొమ్మాట క్రాసింగ్ వద్ద కమాన్ నిర్మిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ. స్లాబ్ కూలి పనిచేస్తున్న నలుగురు కార్మికులకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన కూలీలు స్వల్ప గాయాలతో బయటపడటంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.



# ప్రత్యేక పూజలు...

జలుమూరు ఫిబ్రవరి 14 ప్రజాప్రతినిధి : దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర స్వామి వారిని భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్న నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన . ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని ప్రార్థించారు. పూజల అనంతరం బగ్గు అర్చన స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీముఖలింగేశ్వర స్వామివారి ఆశీస్సులతో నియోజవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం గ ,స్థానిక సర్పంచ్ తమన్న సతీష్ కుమార్ ,దేవా మరియు ఆలయ పాలక మండలి సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు



# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం... రెడ్డివారి గురవారెడ్డి




ప్రజాప్రతినిధి//తిరుపతి జిల్లా ఫిబ్రవరి 14:టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి ప్రజల ఆకాంక్షలు మేరకు రాష్ట్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి సంక్షేమానికి సమపాళ్లలో పెద్దపీట వేస్తూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు. నాయుడు .నాయకత్వం లో విజన్ 2047 లక్ష్యంగా పనిచేసే ప్రజల ఆకాంక్ష మేరకే సంక్షేమ బడ్జెట్ ఇది రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం – భవిష్యత్ కు ఒక బ్లూ ప్రింట్గా రాష్ట్ర బడ్జెట్ ఉంది. ఇది కేవలం గణాంకాల పుస్తకం కాదు. అంకెల గారడీ కాదు .కోట్లాదిమంది ప్రజల జీవితాలలో మార్పు తీసుకువచ్చే విజన్ డాక్యుమెంట్ మాటల కోసం కాకుండా ప్రగతి కోసం ఏర్పా చేసిన బడ్జెట్ ఇది రాష్ట్ర భవిష్యత్ కు స్పష్టమైన దశను, దిశను చూపే విధంగా బడ్జెట్ను ప్రవేశపెట్టడం , ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెటు ను కూటమి ప్రభుత్వం రూపొందించడం జరిగింది.ప్రజల జీవితాలలో నిజమైన మార్పు వచ్చేలా ఈ బడ్జెట్ ఉంది. బడుగు బలహీనవర్గాల అభివృద్దే లక్ష్యంగా , వ్యవసాయం, పారిశ్రామిక, సాగునీటి, విద్య, వైద్యం, టూరిజం, పంచాయితీరాజ్, మహిళా సంక్షేమం రంగాలను బలోపేతం చేసే విధంగా ఈ బడ్జెట్ ను ప్రవేశపెట్టడం జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చింది. రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా ఎన్నడూలేని విధంగా మూలధన వ్యయానికి రూ.53,915 కోట్లు కేటాయించడం అభినంద నీయం.వ్యవ సాయ అనుబంధ రంగాలకు రూ.13,598 కోట్లు కేటాయించడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి అద్దం పడుతుంది గత ఏడాది బడ్జెట్లో రూ.300 కేటాయించి మామిడి, ఉల్లి, కోకో, పొగాకు రైతులకు కేటాయింపులకు మించి రూ.1200 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి కింద ఆదుకోవడం జరిగింది. ఈ ఏడాది కూడా రూ.500 కోట్లు కేటాయించి రైతులకు అండగా గత ప్రభుత్వం అయిదేళ్లలో ధరల స్థిరీకరణకు ఖర్చు చేసింది రూ.880 కోట్లు మాత్రమే సాగునీటి ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. సాగునీటి ప్రాజెక్టులకు ఈ ఏడాది బడ్జెట్లో రూ.18,224 కోట్లు కేటాయించడం జరిగింది. గత ఏడాదితో పోల్చుకుంటే రూ.4 వేల కోట్లు అధికంగా కేటాయించడం జరిగింది గత ఏడాది బడ్జెట్లో ఇళ్ల నిర్మాణానికి రూ.2 వేల కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది రూ.6,357 కోట్లు కేటాయించడం జరిగిందిసంక్షేమానికి గత ఏడాది రూ.41,726 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.53,190 కోట్లు కేటాయించడం జరిగింది బీసీల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రూ.51,021 కోట్లు... ఎస్సీ సంక్షేమం కోసం రూ.20,644 కోట్లు... ఎస్టీ సంక్షేమం కోసం రూ.9,190 కోట్లు... మైనారిటీ సంక్షేమం కోసం రూ.6,090 కోట్లు... మహిళ, శిశు, వికలాంగుల సంక్షేమానికి రూ.4,582 కోట్లు... మొత్తం సంక్షేమానికి రూ.91,527 కోట్లు కేటాయించడం జరిగింది.పాఠశాల విద్యకు రూ.32,308 కోట్లు కేటాయించడం విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతకు అద్దం పడుతుంది. మౌలిక వసతుల కల్పనకు రూ.1500 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,567 కోట్లు, నైపుణ్యా వృద్ధికి రూ.1,232 కోట్లు కేటాయించడమైంది. పంచాయితీరాజ్ శాఖకు రూ.22,942 కోట్లు, వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ కింద రూ.11 వేల కోట్లు, ఆక్వా సబ్సిడీగా రూ.890 కోట్లు కేటాయించడం జరిగింది. గృహనిర్మాణ శాఖకు రూ.6,357 కోట్లు, వైద్యశాఖకు రూ.19,306 కోట్లు, పౌరసరఫరాలకు రూ.3,821 కోట్లు కేటాయించడమైనది. కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు 20 లక్షల నుండి 45 లక్షల వరకు ఉచిత బీమా కవరేజ్ కల్పించే గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రారంభించారు న్యాయ వ్యవస్థకు రూ.349 కోట్లు కేటాయించడమైనది. 100 కొత్త కోర్టులకు కూడా ఆమోదించడమైనది.మున్సిపల్ పట్టణాభివృద్ధికి రూ.14,539 కోట్లు కేటాయించడమైనది. కూటమి ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో 30,607 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది. కార్మిక శాఖకు రూ.735 కోట్లు కేటాయించడం జరిగింది. ప్రతి ఏడాదికి మార్పు వచ్చేలా అన్ని రంగాలలో గణనీయమైన అభివృద్ధి చోటుచేసుకునేలా బలహీనవర్గాల జీవన ప్రమాణాలలో మార్పు జరిగేలా బడ్జెట్ రూపొందించడం జరిగింది.విజన్ 2047 లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు దోహదపడుతుంది.

# వరుస దొంగతనాలు దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల అరెస్టు




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం,సిద్దిపేట జిల్లా మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలు మరియు దోపిడీ ఘటనలకు పాల్పడిన ఇద్దరు నిందితులను మద్దూరు పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్ కొరకు తరలించారని,వారి వద్ద నుండి బంగారు మరియు వెండి ఆభరణాలు మరియు ఇతర సాక్ష్యాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.నిందితుల యొక్క వివరాలు తెలియజేస్తూ, గుండెల్లి రమేష్,జాలపల్లి గ్రామం,మాసంపల్లి రాములు, లింగాపూర్ గ్రామం,వీరు చేసిన నేరాలు తెలియజేస్తూ నిందితులు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో 2025 నవంబర్ నెల నుండి వివిధ గ్రామాలలో దొంగతనాలు మరియు దోపిడీలు చేశారు.వాటి వివరాలు నర్సాయిపల్లి గ్రామములో భార్యాభర్తలను బెదిరించి బంగారు పుస్తెల తాడు మూడు తులాలు,నల్లపూసల తాడు రెండు తులాలు,యాభై మూడు వేల రూపాయల నగదు,దోచుకున్నారు.బైరాన్పల్లి గ్రామములో ఒక మహిళ మెడలోని బంగారం దోచుకునే ప్రయత్నం చేశారు. అలాగే జాలపల్లి గ్రామములో తాళం వేసిన ఇంట్లోకి చొరబడి ఒక జత వెండి పట్టగొలుసులు,పది తులాలు మరియు ఐదు వేల రూపాయల నగదు దొంగిలించారు.కూటిగల్ సమీపంలో ఒక వ్యక్తిని కత్తితో బెదిరించి గొర్రెపిల్ల మరియు సెల్ ఫోన్ దోచుకున్నారు.దొంగిలించిన డబ్బును క్రికెట్ బెట్టింగ్,గోవా క్యాసినో మరియు ఇతర జూదాల్లో ఖర్చు చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు మరియు బంగారు,వెండి వస్తువులను మరియు కీ ప్యాడ్ ను అమ్ముకోవడానికి వెళ్తుండగా లింగాపూర్ గ్రామ శివారులో బైక్ పై అనుమానాస్పదంగా బైక్ తిరుగుతున్న సమయంలో పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద స్వాధీనం చేసిన వస్తువులు,బంగారు పుస్తెల తాడు మూడు తులాలు (నర్సాయిపల్లి గ్రామనికి చెందినది)బంగారు నల్లపూసల తాడు రెండు తులాలు(నర్సాయిపల్లి గ్రామనికి చెందినది)వెండి పట్టగొలుసులు,పది తులాలు (జాలపల్లి గ్రామనికి చెందినది)ఒక హోండా షైన్ మోటార్ సైకిల్ (నెం. ౧+-08-జీ-0485) ఒక కత్తి,ఒక ఐటెల్ కంపెనీ కీప్యాడ్ ఫోన్ (కూటిగల్ శివారులో దొంగలించిన)రెండు నిందితుల సెల్ ఫోన్లు,ఈ సందర్భంగా ఏసిపి సదానందం మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో బంగారు మరియు వెండి దొంగతనాలు పెరిగే అవకాశం ఉంది.మహిళలు,ముఖ్యంగా వృద్ధులు ఒంటరిగా ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని,గ్రామాల్లో సీసీ కెమెరాల నిఘా తక్కువగా ఉండటం వల్ల ఇలాంటి దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారుతోంది.కావున, గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామ ప్రవేశ మార్గాలు,నిష్క్రమణ మార్గాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వద్దకు వచ్చినప్పుడు వారిని లోపలికి రానివ్వకూడదు. మాటలతో నమ్మించే ప్రయత్నం చేసే అపరిచితుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నిందితులను త్వరగా పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అభినందించారు.ఈ కేసును చేదించడంలో బి.రమేష్. సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్- చేర్యాల,ఎండీ ఆషిఫ్.ఎస్ ఐ మద్దూరు, మద్దూరు కానిస్టేబుళ్ళు ఏం. రవి,పి అనిల్,పి నాగరాజు మరియు ఏ.గణేశ్ ముఖ్య పాత్ర వహించినారని తెలిపారు.

# పిల్లలందరికీ డీవార్మింగ్ మాత్రలు వేయిద్దాం




శ్రీకాకుళం, ఫిబ్రవరి 14 ప్రజాప్రతినిధి :నులి పురుగులు లేని ఆరోగ్యకరమైన జిల్లా కోసం పిల్లలందరికీ డీవార్మింగ్ మాత్రలు వేయిద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె అనిత అన్నారు.జిల్లాలో ఈ నెల 17 న డి వార్మింగ్ డే నిర్వహించి జిల్లా వ్యాప్తంగా ఉన్న 4,27,000 వేల మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ -400 మీ.గ్రా మాత్రలు పంపిణీ చేసి.. అక్కడే పిల్లలతో మాత్రలు వేయిస్తామని ఆమె పేర్కొన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... రక్తహీనత లేని సమాజ స్థాపనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని చేపడటున్నయని ఆమె అన్నారు.1-19 సంవత్స రాల లోపు వారికి విధిగా నులుపురుగుల నివారణకు ఈ మాత్రలు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, విద్యా శాఖ సిబ్బంది (ఉపాధ్యాయులు) మరియు అంగన్వాడి కార్యకర్తల సమన్వయముతో జరుపబడునని పేర్కొన్నారు. జిల్లాకు సంబంధించి ఐదు లక్షల ఏడు వేల మాత్రలు వచ్చాయని పిల్లలు అంతా విధిగా వేసికోవాలన్నారు.పాఠశాలలో ఉదయం గం.8-00 లు నుండి సాయంత్రం గం.5-00ల వరకు నిర్దేశించిన ప్రణాళిక పద్ధతిలో ఈ కార్యక్రమం జరుపబడన్నారు. మధ్యాహ్నం భోజనం తరువాత ప్రతి విద్యార్థికి ఒక మాత్ర (ఆల్బెండజోల్ -400 మీ.గ్రా.) నమిలి తినిపించడం జరుగుతుందన్నారు.ప్రతి పాఠశాలకు ఒక ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షకుడుగా నియమించడం జరిగినదన్నారు. ఆ గ్రామాలలో ఆషా కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు మరియు స్వచ్ఛంద సేవా సంఘాల వారు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసినదిగా కోరడమైనదన్నారు.దుష్పరిణామాలు కనిపించిన వెంటనే దగ్గరలో ఉన్న పి.హెచ్.సి వైద్యాధికారిని సంప్రదించవలెనన్నారు. జిల్లాలో ఉన్న అన్ని పాటశాలలు.. కళాశాలలు.. కేజిబీవి స్కూల్స్.. అంగన్వాడీ స్కూల్స్ మొదలగు విద్యా సంస్థలకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది వెళ్లి ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పాదరక్షలు ధరించడం, ఆహారం, నీటిని శుభ్రంగా ఉంచుకోవడం వలన నులిపురుగుల నిర్మూలించ వచ్చునని ఆమె అన్నారు.కావున అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని ఆమె పిలిపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రాందాస్, డాక్టర్ శివరంజని, డాక్టర్ బి రవీంద్ర, డోమ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు

# శ్రీ వెంకట సాయి విద్యాసంస్థలో వీడ్కోలు సభ



మనప్రజాప్రతినిధి// ఫిబ్రవరి:నేడు శ్రీ వెంకట వెంకట సాయి విద్యాసంస్థలో ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థులకి మరియు 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా విద్యాసంస్థల చైర్మన్ కే జగన్నాథం గారు కష్టపడితే విద్యార్థులకు అత్యుత్తమ భవిష్యత్తు ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి పురుషోత్తమరావు మరియు ఏవో సీతారాం ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# మంత్రితో కలిసి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బొజ్జల



ప్రజాప్రతినిధి//ఏర్పేడు మండలం ఫిబ్రవరి 14:మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల శుభ సందర్భంగా, ఈ రోజు ఏర్పేడు మండలం గుడిమల్లం గ్రామంలో వెలసిన చారిత్రాత్మక శ్రీ పరశురామేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం జరిగింది. క్రీస్తు పూర్వం 2వ శతాబ్దానికి చెందిన ఈ క్షేత్రం, ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన మరియు ఇప్పటికీ పూజలందుకుంటున్న ఏకైక శివలింగంగా ప్రసిద్ధి గాంచింది. పరశురాముడు ఇక్కడ స్వామివారిని పూజించి తరించాడని పురాణాలు చెబుతున్నాయి.రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి తో కలిసి, ఆలయ పాలకమండలి సభ్యులు మరియు కూటమి నాయకులతో కలిసి స్వామివారికి ప్రభుత్వ తరపున పట్టువస్త్రాలను సమర్పించాము. అనంతరం మంత్రి తో కలిసి ఆలయ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన మరియు దానికి కావలసిన నిధుల కేటాయింపు గురించి ప్రత్యేకంగా చర్చించాను. మన వారసత్వ సంపదను కాపాడుకుంటూ, భక్తులకు మెరుగైన వసతులు కల్పించేలా నా కృషి నిరంతరం కొనసాగుతుంది. ఆ పరమశివుని కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# ఘనంగా సేవాలాల్ జయంతి వేడుక



హుస్నాబాద్ ఫిబ్రవరి //మన ప్రజాప్రతినిధి:అక్కన్నపేట మండలంలోని పంతులు తండా గ్రామపంచాయతీలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ గారి 287వ జయంతి ఉత్సవాలు ఆదివారం.భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భోగ్ బండారు కార్యక్రమం గ్రామ సర్పంచ్ చిన్న (రాజు నాయక్ )ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ గారి బోధనలు, ఆదర్శాలను స్మరించుకున్నారు. సేవాలాల్ మహారాజ్ గారి జీవితం త్యాగం, సేవ, సమానత్వానికి ప్రతీకగా నిలిచిందని వక్తలు కొనియాడారు. ఆయన బోధించిన సన్మార్గం, నైతిక విలువలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. భోగ్ బండారు అనంతరం ప్రసాద వితరణ చేపట్టి, గ్రామస్తులు పరస్పర సౌహార్థం, ఐక్యతతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ . చిన్న నాయక్. (రాజునాయక్ )మాట్లాడుతూ, ఇలాంటి జయంతి ఉత్సవాలు గ్రామంలో సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. భవిష్యత్తులోనూ సేవాలాల్ మహారాజ్ గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు

# రైతు తన భూమిలో ఉన్న చెట్ల తోపాటు...

## హరితహారం చెట్లను నరికివేసిన ఆవేదన



హుస్నాబాద్ఫిబ్రవరి//మనప్రజా ప్రతినిధి: చిగురు మామిడి మండలంఉల్లంపల్లి గ్రామానికి చెందిన వస్తాదుల విజయ్ చెందిన భూమిలో చెట్లు టేకు చెట్లు మరియు ఇతర చెట్లు గుర్తుతెలియని వ్యక్తులు వేర్లతో సహా నరికి వేయడం కలకాలం రేపింది సుమారు 30 నుండి 35 వరకు చెట్లు ధ్వంసం చేశారు అలాగే రోడ్డుకు ఆనుకొని ఉన్న హరితహారం చెట్లు 10 నుండి 15 చెట్లను ధ్వంసం చేశారు అని రైతు తెలిపారు స్థానికుల సమాచారం మేరకు ఓదెల మల్లికార్జున స్వామి దేవాలయం కమిటీ కి చెందిన వారు చెట్లను నరికి వేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం అవుతుంది అలాగే గ్రామపంచాయతీ మరియు ఫారెస్ట్ శాఖ అనుమతులు లేకుండా చెట్లను నరికి వేయడం పై రైతు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ ఘటనపై సంబంధిత అధికారులు ఫారెస్ట్ ఆఫీసర్లు వెంటనే విచారణ చేపట్టి బాధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు మరియు రైతు డిమాండ్ చేశారు అదేవిధంగా రైతు సొంత భూమిలో అతని అనుమతి లేకుండా ఎలక్ట్రిక్ స్తంభాలు ఏర్పాటు చేశారని కూడా రైతు ఆరోపించారు రోడ్డు పక్కన భూమి ఉన్నప్పటికీ రైతు పొలంలో స్తంభం ఏర్పాటు చేయడం పై ఆగ్రహం వ్యక్తం చేశాడు తనకు తీవ్ర నష్టం జరిగిందని ఆరోపిస్తున్నాడు దీనిపై విచారణ జరపాలని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు హరితహారం చెట్లు ను రక్షించడం ప్రతి ఒక్కరు బాధ్యత అని రైతు తెలిపాడు

# ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థుల విద్యా విహారం



(మన ప్రజాప్రతినిధి ఫిబ్రవరి 14):రాయపోల్ మండలం చిన్న మాసన్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఈరోజు విజ్ఞాన విహారయాత్ర కోసం హైదరాబాద్కు తీసుకెళ్లారు. ప్రధానోపాధ్యాయులు మద్దూరి శ్రీకాంత్, ఉపాధ్యాయురాలు కళ్యాణి ఆధ్వర్యంలో విద్యార్థులు పలు చారిత్రక, సాంస్కృతిక, శాస్త్రీయ ప్రదర్శన ప్రదేశాలను సందర్శించారు. విద్యార్థులు సాలార్జంగ్ మ్యూజియం, నెహ్రూ జూలాజికల్ పార్క్, బిర్లా టెంపుల్, గోల్కొండ కోట వంటి ప్రముఖ ప్రదేశాలను సందర్శించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మద్దూరి శ్రీకాంత్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలకు మించిన పరిజ్ఞానం విద్యార్థులకు అందించేందుకు ఇటువంటి విహార యాత్రలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. చారిత్రక, సాంస్కృతిక, శాస్త్రీయ ప్రదర్శనలను ప్రత్యక్షంగా చూడడం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరుగుతుందని, మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. పుస్తకాల్లో చదివిన విషయాలను ప్రత్యక్షంగా పరిశీలించడం వల్ల విద్యార్థులలో ఆసక్తి పెరిగి అవి వారి మనసులో శాశ్వతంగా నిలిచిపోతాయని వివరించారు.జీవ వైవిధ్యం, చారిత్రక సంపద, సాంకేతిక ప్రదర్శనలను సందర్శించడం విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ విహారయాత్రలో ఉపాధ్యాయురాలు కళ్యాణి, ఎస్ఎంసీ చైర్మన్ ఎండి జరీనా, హెడ్ కుక్ ప్రేమలతతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# తొగుట సీఐ షేక్ లతీఫ్ శాంతియుతంగా జాతర నిర్వహణకు అధికారుల అప్రమత్తం



(మన ప్రజా ప్రతినిధిఫిబ్రవరి 14):సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని శ్రీ శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని 14 నుండి 16 వరకు మూడు రోజులపాటు శివరాత్రి జాతర, స్వామివారి కళ్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్ అనురాధ రమేష్ తెలిపారు.ఆమె ఆధ్వర్యంలో జాతరకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయంలోని విగ్రహాలను రంగురంగులతో అలంకరించి భక్తుల దర్శనార్థం సిద్ధం చేశారు.జాతరలో భాగంగా 14వ తేదీ ఉదయం 10 గంటలకు భక్త బృందంతో భజన కీర్తనలు నిర్వహించనున్నారు. 15వ తేదీన అఖండ దీపారాధన, గణపతి పూజ, గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు, ఉమామహేశ్వరి స్వామి కళ్యాణం, ఒడిబియ్యం కార్యక్రమం, మంగళ వాయిద్యాలతో స్వామివారి ఎదుర్కోలు నిర్వహించనున్నారు. అలాగే ఆంజనేయ స్వామి ఆలయం వరకు ప్రతిష్ఠాత్మకంగా కార్యక్రమాలు చేపట్టనున్నారు.మూడో రోజు అగ్ని గుండాలు తొక్కుట, బండ్ల ఊరేగింపు వంటి సంప్రదాయ కార్యక్రమాలతో జాతర ఘనంగా కొనసాగనుంది.జాతర సందర్భంగా భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా తొగుట సీఐ షేక్ లతీఫ్, దౌల్తాబాద్ ఎస్సై అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది.ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులతో పాటు పోలీస్ సిబ్బంది కానిస్టేబుళ్లు సతీష్, స్వామి, సాయి చరణ్, కుమార్, దేవరాజు తదితరులు పాల్గొని ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశమున్నందున జాతరను శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు

# అవినీతి రహిత పురపాలక సంఘంగా తీర్చి దిద్దండి

## -సూర్యాపేట పట్టణాభివృద్ధికి అవిరళ కృషి చేస్తా -మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





(మనప్రజాప్రతినిధి)// సూర్యాపేట ఫిబ్రవరి 15:సూర్యాపేట పురపాలక సంఘాన్నిఅవినీతి రహిత పురపాలక సంఘంగా తీర్చి దిద్దాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి హితవుపలికారు.గతంలో సూర్యాపేట పురపాలక సంఘంలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలు పునరావృతం కాకుండా నూతన పాలక మండలి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఉద్బోధించారు.నూతనంగా ఎన్నికయిన సూర్యాపేట పురపాలక సంఘం ప్రతినిధులు శనివారం సాయంత్రం హైదరాబాద్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.48 వార్డులకు గాను 31 స్థానాలలో విజయం సాధించిన కౌన్సిలర్లను ఆయన అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారి మీద ఉన్న సూర్యాపేట పట్టణం ఇప్పటివరకు ఊహించిన మేరకు అభివృద్ధి సాధించ లేక పోయిందన్నారు పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ మీద చూపిన ఆదరణ అనన్య సామాన్యమైనదని,ప్రజలు మనమీద అపారమైన నమ్మకంతో గురుతర బాధ్యత మోపారని వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు పని చేయాలని ఆయన ఉపదేశించారు.జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిగా సూర్యాపేట పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు.ఎప్పటికప్పుడు పట్టణాభివృద్ధిపై సమీక్షించుకుని ప్రత్యేక ప్రణాళికలు రూపొందించేందుకు కార్యాచరణ పథకాన్ని రూపొందించుకుండమన్నారు.అందుకు సరిపడా నిధులు తెచ్చి సూర్యాపేట పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,ఏ.ఐ.సి.సి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి,సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,పిసిసి కార్యదర్శి చకిలం రాజేశ్వర్ రావు లతో పాటు నూతనంగా ఎన్నికయిన కౌన్సిలర్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

# ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని అమలు చేస్తాను

## వెల్జిపూర్ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్

మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 14 ఫిబ్రవరి:ఇల్లంతకుంట మండలంలోని వేల్జిపూర్ గ్రామంలో అంగన్వాడీలో చదువుతున్న పిల్లలకి యూనిఫామ్ లు పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్న సర్పంచ్ నాయిని నవీన్ కుమార్.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో ప్రభుత్వం చిన్నారుల సంక్షేమం కోసం తీసుకుంటున్న పలు సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా అంగన్వాడి పిల్లలకు ఉచిత యూనిఫాంల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.మన గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు పూర్తిగా చేరేలా గ్రామపంచాయతీ తరఫున కృషి చేస్తామని మీ అందరికీ హామీ ఇస్తున్నాను. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు ప్రతిరోజు పంపించాలని అన్నారు. మన

# పుల్వామా అమర జవాన్లకు వినమ్ర నివాళి



## -బీసీ నేత ధనుంజయ నాయుడు ఎమ్మార్పీఎస్ నేత అరుణ్ కుమార్ మాదిగ ఘన నివాళి

నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీర జవాన్లకు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ప్రధాన కూడలి లో బీసీ హక్కుల సాధన సమితి మరియు ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడు యడవల్లి అరుణ్ కుమార్ మాదిగ మాట్లాడుతూ... పుల్వామా ఉగ్రదాడిలో 40 మంది భారత వీర జవాన్లు దేశం కోసం ప్రాణం అర్పించి ఆరు సంవత్సరాలయిందని నాడు భారత ప్రధానమంత్రి మాట్లాడుతూ పుల్వామా ఉగ్రవాదులు భూమి అంచన ఎక్కడున్నా వెతికి పట్టుకుంటామని ఉత్తర ప్రగల్భాలు పలికాడని ఆరు సంవత్సరాలు అయినా ఒక్క ఉగ్రవాది దాడి ఎడమకాలు చిటికెన వేలు కూడా కదిలించలేకపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఎన్నికల కోసం ఓట్ల కోసం ప్రజలను రెచ్చగొట్టడం తప్ప నిజంగా దేశం కోసం ధర్మం కోసం జీవించే వాళ్లయితే ఉగ్రవాదులను వెతికి పట్టుకోలేరా అని ఆయన ప్రశ్నించారు అణువణువునా దేశభక్తిని గుండెల నిండా ఈ దేశం మీద ప్రేమను నింపుకొని పుల్వామా దాడిలో అమరుడైన వీర సైనికులకు యావత్తు దేశం జోహార్ అర్పిస్తుందని మీ త్యాగం వృధా కాదని మీ ఆశయం ఆగిపోదు అని మీ వెంటే యావత్ భారత్ జాతి నిలబడి సాల్యూట్! చేస్తుందని వారు అన్నారు కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను అడ్వకేట్ చిత్రం విశ్వనాధ్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి వాసా పల్లయ్య బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్ ప్రజా సంఘాల నాయకులు గుత్త అనిల్ కుమార్ ఉల్లెందుల దుర్గయ్య, కొండా పుట్టయ్య పాల్గొన్నారు

# శ్రీకాళహస్తీశ్వర సన్నిధిలో శివ్ నాట్య కళా నిలయం అద్భుత నృత్యార్చన





ప్రజాప్రతినిధి తిరుపతి జిల్లా :తిరుపతి, ఫిబ్రవరి 14:శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తి, సాంస్కృతిక వైభవం వెల్లివిరిసిన వేళశ్రీకాళహస్తీశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తి, ఆధ్యాత్మికత, సాంస్కృతిక వైభవం కలగలిసిన అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ సందర్భంగా శివ్ నాట్య కళా నిలయం (ట్రస్ ట్రస్ట్) ఆధ్వర్యంలో ప్రత్యేక నృత్య ప్రదర్శన నిర్వహించబడింది.శివతాండవ స్తోత్రాలు, భక్తిరస నృత్యావిష్కరణలతో కళాకారులు స్వామివారికి నృత్యార్చన సమర్పించారు. భక్తి పరవశంతో సాగిన ఈ కార్యక్రమం ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. శివనామ స్మరణల మధ్య నర్తకులు అందించిన ప్రతి అడుగు భక్తి భావాన్ని ప్రతిబింబించింది.ఈ కార్యక్రమానికి ఆలయ చైర్మన్ శ్రీ కొట్టె సాయి ముఖ్య అతిథిగా హాజరై కళాకారులను అభినందించారు. ట్రస్ ట్రస్ట్ చైర్మన్ రూపేష్ బాబు, నాట్య గురువు శ్రీమతి సి. సవ్రీవ్య, ట్రస్ట్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ, "శ్రీకాళహస్తీశ్వర స్వామివారి సన్నిధిలో నృత్య సేవ చేయడం మా భాగ్యం. స్వామివారి కృపతో ఈ కార్యక్రమం ఎంతో విజయవంతమైంది. భక్తుల ఆశీర్వాదం మాకు ప్రేరణ" అని పేర్కొన్నారు. స్వామివారి మహిమను కొనియాడుతూ భక్తి భావంతో మాట్లాడారు.మహాశివరాత్రి వేడుకల సందర్భంగా నిర్వహించిన ఈ సాంస్కృతిక కార్యక్రమం భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని మరింత పెంచింది. బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

# హుస్నాబాద్ లో నాగార్జున డైరీ పార్లర్ ప్రారంభం



హుస్నాబాద్ ఫిబ్రవరి మన ప్రజాప్రతినిధి. 15):సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో నాగార్జున డైయిరీ పార్లర్ నీ ప్రారంభించిన కౌన్సిలర్లు 10వ వార్డు సావుల మంజుల 11వ వార్డు పూధరి వరప్రసాద్ మరియు కంపెనీ సేల్స్ మేనేజర్ శివకుమార్ కలసి నాగార్జున డైయిరీ పార్లర్ ను ప్రారంభించడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006లో పుల్లూరి ప్రభాకర్ రావు చైర్మన్ చే ప్రారంభించిన నాగార్జున డైయిరీ వినియోగ దారులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులను అందించడమే ధ్యేయమని పాడి రైతులకు నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు నాగార్జున డైరీ వారు నాగార్జున రైస్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు రైస్ లో ఆర్ఎన్ఆర్ ,జైశ్రీరామ్ తోపాటు పాల పదార్థాలు వినియోగదారులు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సేల్స్ మేనేజర్ వెనిశెట్టి శివకుమార్ మరియు కంపెనీ ఏఎస్ఎమ్ విజయ్, వెంకటేష్ రాకేష్ పార్లర్ నిర్వాహకులు రాజేంద్ర ప్రసాద్ ద్ ప్రసాద్ స్థానిక ఏజెంట్ ప్రకాష్ తదితరులు ప్రజలు పాల్గొన్నారు

# మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబవుతున్న అగ్రహారం సోమేశ్వర శివాలయం



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఫిబ్రవరి 14,:మెదక్ జిల్లా, చేగుంట మండలం, రాంపూర్ అటవీ ప్రాంతంలోని అతి పురాతనమైన శ్రీశ్రీశ్రీ అగ్రహారం సోమేశ్వర శివాలయం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సర్వాంగ సుందరంగా సిద్ధమవుతోంది. ఈ నెల 15వ తేదీ ఉదయం సహస్ర పుష్పార్చన, సాయంత్రం 5 గంటలకు గండ దీపం ఊరేగింపు, రాత్రి 9 గంటలకు ఉపవాస జాగరణ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే 16వ తేదీ ఉదయం 9 గంటలకు అభిషేకం, అన్నపూజ కార్యక్రమాలతో పాటు సాయంత్రం వరకు అన్నదానం, రాత్రి 8 గంటలకు బోనాల ఊరేగింపు, రాత్రి 9 గంటల నుండి తెల్లవారుజాము వరకు బుర్రకథ ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు మండల ప్రజలే కాకుండా ఇతర జిల్లాల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా గ్రామ సర్పంచ్ కాశబోయిన నాగమణి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

# ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని అమలు చేస్తాను వెల్జిపూర్ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్



మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 14 ఫిబ్రవరి: ఇల్లంతకుంట మండలంలోని వేల్జిపూర్ గ్రామంలో అంగన్వాడీలో చదువు తున్న పిల్లలకి యూనిఫామ్ లు పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్న సర్పంచ్ నాయిని నవీన్ కుమార్. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మాన కొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో ప్రభుత్వం చిన్నారుల సంక్షేమం కోసం తీసుకుంటున్న పలు సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా అంగన్వాడి పిల్లలకు ఉచిత యూనిఫాంల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మన గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు పూర్తిగా చేరేలా గ్రామపంచాయతీ తరఫున కృషి చేస్తామని మీ అందరికీ హామీ ఇస్తున్నాను. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు ప్రతిరోజు పంపించాలని అన్నారు. మన చిన్నారులు ఆరోగ్యంగా,విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్,వార్డు సభ్యులు గొల్ల కమిటీ మల్లవ్వ శంకర్,సంగెం ముత్తవ్వ,బొల్లారం ప్రసన్న కుమార్, అంగన్వాడీ టీచర్ మంజుల,సహాయకురాలు సత్తవ్వ లు పాల్గొన్నారు.

# సీఎం కప్ 2 ఎడిషన్ సిద్దిపేట జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో




హుస్నాబాద్ ఫిబ్రవరి//మన ప్రజాప్రతినిధి. 14): హుస్నాబాద్ పురుషుల కబడ్డీ జట్టు ఫైనల్ మ్యాచ్ లో గజ్వేల్ జట్టు పై విజయం సాధించి ఛాంపియన్ గా నిలిచింది. జిల్లా కలెక్టర్ హైమావతి గారి చేతుల మీదుగా ఛాంపియన్ షిప్ కప్ అందుకుంటున్న క్రీడాకారులు. ఈ కార్యక్రమంలో డి వై ఎస్ ఓ జంగపల్లి వెంకట నర్సయ్య, ఎస్ జి ఫ్ సెక్రటరీ సౌందర్య మరియు సీనియర్ పిడి పాతూరి సుజాత గారు పాల్గొన్నారు. జట్టు కు మేనేజర్ గా రాజేష్, కోచ్ కృష్ణ వ్యవహరించినట్లు పిడి ఆర్ శ్రీనివాస్ తెలియజేశారు

# ఈనెల 16న ప్రజావాణి రద్దు జిల్లా కలెక్టర్ హనుమంత రావు...



మనప్రజాప్రతినిధి//యాదాద్రి భువనగిరి :మున్సి పల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున, ఈ నెల 16వ తేదీ (సోమవారం) నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరిం చాలని కలెక్టర్ కోరారు

# రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఫిబ్రవరి 14: మెదక్ జిల్లా, చేగుంట మండలం, గుమ్మడిదల ప్రాథమిక పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-21 అంతర్ జిల్లాల వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు చేగుంట అయిత పరంజ్యోతి, చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ హాజరై క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జిల్లా పేరు ప్రఖ్యాతలను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా సెక్రటరీ ఏ. కృష్ణ, మెదక్ సెక్రటరీ కె. రవీందర్, సిద్దిపేట సెక్రటరీ కె. రవీందర్ రెడ్డి, సీనియర్ క్రీడాకారులు ఏ. విష్ణువర్ధన్ రెడ్డి, సుధర్ సింగ్, సంతోష్ కుమార్, మహేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మహేందర్, స్వామి కుమార్, ఎండి ఇర్ఫాన్, రాబట్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికైన వార్డు కౌన్సిలర్స్ లతో ప్రమాణ స్వీకరణ



మనప్రజాప్రతినిధి//యాదాద్రి భువనగిరి:రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్స్ లతో ప్రమాణ స్వీకరణ ఈ నెల 16 న చేయించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం రోజు కలెక్టరేట్ లోని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గారి చాంబర్లో మున్సిపల్ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్స్, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మున్సి పల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక లో బాగంగా ఎన్నికైన వార్డ్ కౌన్సిలర్లు కలిసి చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నికకై ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 16 న ప్రమాణస్వీకారం చేయనున్న వార్డు కౌన్సిలర్ల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని , వార్డు కౌన్సిల్స్ మొత్తం ప్రమాణ స్వీకారం చేయాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల ప్రకారం సమయ పాలన పాటించి ఉదయం 11 గంటలకు అందరూ సభ్యులు ఎన్నికైన వార్డు కౌన్సిలర్స్ ప్రమాణ స్వీకారం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రొసీజర్ ప్రకారం నిర్వహించాలని సూచన చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. మంచి వాతావరణంలో మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించి ప్రమాణ స్వీకారం చేయాలని పేర్కొన్నారు. ఎన్నిక కై ఆథరైజ్ గా ఒక్కొక్క మున్సిపాలిటీకి ఒక్కొక అధికారిని నియమించడం జరిగిందని, భువనగిరి మున్సిపాలిటీ ఆర్థరైజ్డ్ ఆఫీసర్ గా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు , యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి , పోచంపల్లి మున్సిపాలిటీ కి సంబంధించి జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఆలేరు మున్సిపాలిటీకి సంబంధించి ఆర్డిఓ కృష్ణారెడ్డి, చౌటుప్పల్ మున్సిపాలిటీకి ఆర్డిఓ శేఖర్ రెడ్డి, మోత్కూర్ మున్సిపాలిటీకి సంబంధించి అడిషనల్ డిఆర్డిఓ సురేష్ ను నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి లడ్డూ అంశంపై నెల్లూరులో పొర్లుడు దండాల కార్యక్రమం

**- అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపుతో ప్రత్యేక దీక్ష**

**- 4.5 కిలోమీటర్ల దూరం గోవింద నామస్మరణ**

**- వందలాది భక్తులు, జనసైనికుల భాగస్వామ్యం**




నెల్లూరు, ఫిబ్రవరి 14 (మనప్రజాప్రతినిధి): తిరుపతి లడ్డూలో జరిగిన కల్తీ ఘటన కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని పేర్కొంటూ, దీనిపై ప్రతి హిందువు స్పందించాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు నెల్లూరులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జనసేన జిల్లా సీనియర్ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో పొర్లుడు దండాల కార్యక్రమం చేపట్టారు. శనివారం ఉదయం 8 గంటలకు శ్రీ రాజరాజేశ్వరీ దేవాలయం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం మాగుంట లేఅవుట్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వరకు సుమారు 4.5 కిలోమీటర్ల దూరం సాగింది. గోవింద నామస్మరణల మధ్య నూనె మల్లికార్జున యాదవ్ పొర్లుడు దండాలు పెట్టారు. వందలాది భక్తులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొని కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ సనాతన ధర్మ రక్షణలో జనసేన నాయకులు ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. తిరుపతి లడ్డూ అంశంపై నిజానిజాలు వెలికితీయాలని, భక్తుల విశ్వాసాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం నెల్లూరులో చర్చనీయాంశమైంది. కార్యక్రమం శాంతియుతంగా ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల విశ్వాసాలకు భంగం కలిగించే ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పాల్గొన్నవారు కోరారు.

# విశాఖలో రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో భారీ చోరీ

**- తీర్థయాత్రకు వెళ్లిన కుటుంబం గైర్హాజరీలో ఘటన**

**- 21 తులాల బంగారం, రూ.6 లక్షల నగదు మాయం**

**- పోలీసుల దర్యాప్తు ప్రారంభం**



విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (మనప్రజాప్రతినిధి): విశాఖలోని కొమ్మది ప్రాంతం వివేకానంద కాలనీలో రిటైర్డ్ విద్యుత్ శాఖ ఉద్యోగి అప్పలరాజు (62) నివాసంలో చోరీ జరిగింది. ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లిన ఆయన ఇంటికి తాళం వేసి వెళ్లారు. యాత్ర ముగించుకొని తిరిగి వచ్చినప్పుడు ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం కలిగింది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలు ఖాళీగా కనిపించాయి. 21 తులాల బంగారు ఆభరణాలు, రూ. 6 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఇంటిని లక్ష్యంగా చేసుకుని పథకం ప్రకారం దొంగలు చోరీ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై సమాచారం సేకరిస్తున్నారు. చోరీ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దొంగలను త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. గృహాలు ఖాళీగా ఉంచే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

